క్లుప్తంగా

సస్యరక్షణ పద్ధతులు పాటించండి



బుళ్లసముద్రంలో మొక్కజొన్న తోటను పరిశీలిస్తున్న అధికారులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లస ముద్రం గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ ఏఓ తిమ్మప్ప ,ఆర్బీకే సిబ్బందితో కలిసి మొక్కజొన్న పంటకు సోకిన తెగుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించిందని నివారణకు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. ఎకరాకు 400 మిల్లీ లీటర్లు క్వినాలపాస్ మందును 200 లీటర్లు నీటితో పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌చార్జ్ దివాకర్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు విరివిగా నాటించండి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయసింహ

రొళ్ల: నియోజకవవర్గం వ్యాప్తంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం కింద పండ్ల మొక్కలు విరివిగా నాటించాలని మడకశిర ఉపాధి పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయసింహ తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్‌తో కలిసి ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ జయసింహ పలు సూచనలు, సలహాలిచ్చారు.

ఎస్పీని కలిసిన దీపిక



ఎస్పీని కలిసిన హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికారెడ్డి

హిందూపురం అర్బన్: హిందూపురం నియోజకవర్గంలో మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలు జరగకుండా చూడాలి.. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి' అని ఎస్పీ మాధవరెడ్డిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక కోరారు. బుధవారం రాత్రి పుట్టపర్తిలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ దృష్టికి వివిధ అంశాలను తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

హిందూపురం అర్బన్: పట్టణంలోని మేళాపురంలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగింది. సూరి అనే వ్యక్తి ఇంట్లోకి అదే ప్రాంతానికి చెందిన అశోక్ అనే వ్యక్తి వెళ్లడంతో గొడవ జరిగింది. తన ఇంట్లోకి ఎందుకొచ్చావంటూ అశోక్ వాదనకు దిగారు. ఈ నేపథ్యంలో ఇద్దరు ఘర్షణకు దిగడంతో ఇద్దరూ గాయపడగా.. ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



హెల్మెట్ ప్రాముఖ్యతపై పోలీసుల బైక్ ర్యాలీ

పావగడ: హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి అన్న నినాదంతో వైఎస్ హొసకోటలో పోలీసులు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ కాంతరెడ్డి , ఎస్ఐ అర్జున్ గౌడ, ఏఎస్ఐ హనుమనాయక్, శివప్ప, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రి అందజేసిన దృశ్యం

పావగడ: స్థానిక కేఎస్‌జేయూ పదాధికారులు పట్టణంలోని అతి ప్రాచీన కన్నడ మాధ్యమ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రి అందించారు. పాఠశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మైఖేల్ మాట్లాడుతూ విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు.

వలంటీర్లకు వందనం

మా ప్రాణాలకు ఆమె ప్రాణం అడ్డేసింది



వృద్ధురాలి మృతదేహాన్నిపై అంతస్తు నుంచి కిందికి దించుతున్న దృశ్యం (ఫైల్)

హిందూపురం అర్బన్: కరోనా కేసులు ఎక్కువగా ఉండటంతో అధికారులు ఆంక్షలు విధించారు. ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి. ప్రాణాలకు తెగించి నేనున్నానంటూ వలంటీర్ ముందుకు వచ్చి తన ప్రాణాలను అడ్డు వేసిన సంఘటన చిలమత్తూరు మండల కేంద్రంలో బ్యాంక్ వీధిలో జరిగింది. ఉపాధ్యాయుడు పురుషోత్తమరెడ్డి తల్లి రామలక్ష్మమ్మకు కరోనా సోకింది. తరువాత కుటుంబ సభ్యులకూ జ్వరం వచ్చింది. విషయం తెలుసుకొన్న వలంటీర్ వేదావతి అన్నీ తానై సేవలు అందించింది. 2021 మే 19న కరోనాతో రామలక్ష్మమ్మ మృతి చెందింది. ఎవరూ అక్కడికెళ్లే సాహసం చేయలేదు. వలంటీర్ భర్త నవీన్ ముందుండి పురుషోత్తమరెడ్డితో కలిసి మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.

వారి సేవలను వెలకట్టలేం



కరోనా సమయంలో నా అనేవాళ్లు ఎవరూ మా ఇంటి దగ్గరకు కూడా రాలేదు. అయితే మేమున్నామంటూ ఆనాడు వలంటీర్ వేదవతి కుటుంబం అందించిన సేవలు నా జీవితంలో మరవలేను. వారే స్వయంగా వంట వండి హోమ్ క్వారంటైన్‌లో ఉన్న మాకు అందించారు. వలంటీర్ల వ్యవస్థ లేక పోతే ఇలాంటి సేవలు అందేవికావు.
– పురుషోత్తమరెడ్డి, ఉపాధ్యాయుడు

ఆపదలో అండగా నిలిచారు



గంగప్పతో వేలిముద్రలు తీసుకుంటున్న వలంటీర్ పేరేంద్రప్రసాద్ (ఫైల్)

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన చాపాయప్ప గారి గంగప్ప కడుపునొప్పితో బాధపడేవాడు. హిందూపురంలోని పలు ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ఆఖరికి అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రిలో 2022 డిసెంబర్ నెలలో అపెండిక్స్ శస్త్ర చికిత్స చేయించుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన గంగప్ప ఆ సమయంలో ఆర్థికంగా కూడా ఎంతో ఇబ్బంది పడ్డారు. అయితే ప్రభుత్వం ద్వారా వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్న ఆయనకు ఆ నెలలో అందాల్సిన పింఛన్ డబ్బును స్థానిక 5 క్లస్టర్ వలంటీర్ పేరేంద్రప్రసాద్ తన సొంత ఖర్చులతో అనంతపురానికి వెళ్లి అందజేశారు.

ఎంతో సాయం చేశారయ్యా...



మాది పేద కుటుంబం. కడుపునొప్పితో బాధపడుతూ నేనెక్కడో అనంతపురంలో శస్త్ర చికిత్స చేయించుకున్నాను. అయితే మా పరిస్థితిని తెలుసుకొని వలంటీర్ పేరేంద్రప్రసాద్ ఆస్పత్రికి వచ్చి పింఛన్ డబ్బులిచ్చారు. అప్పటికే ఇబ్బందుల్లో ఉన్న మా కుటుంబానికి ఆ డబ్బు ఎంతో ఆసరా అయింది. వలంటీర్ వ్యవస్థతో సీఎం జగన్ మా పాలిట దైవంలా మారారు.
– గంగప్ప, శ్రీరంగరాజుపల్లి, పరిగి

గడప గడపలో ఆదరణ





గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ , అమరాపురంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొద్దం: ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా చేస్తున్న ఏకైక ప్రభుత్వం 'జగనన్న ప్రభుత్వం ' అన్ని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. మండల పరిధిలోని నారానగేపల్లి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో గ్రామస్తులకు జరిగిన లబ్ధిని వివరిస్తూ వాటికి సంబంధించిన బ్రౌచర్లను లబ్ధిదారులకు అందజేశారు. తాను ఎవరిని పలకరించినా సంక్షేమ ఫలాలు పక్కాగా అందుతున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ సుపరిపాలనకు ఇదే నిదర్శనంగా నిలుస్తోందని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. అపరిష్కృత సమస్యలు తెలుసుకునే చక్కటి అవకాశం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో లభిస్తోందన్నారు. దళారీ వ్యవస్థకు తావులేకుండా పారదర్శక పాలనతో సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరుతున్నాయని చెప్పారు. పార్టీ, ప్రాంతం, కుల,మత భేదాలు లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగార్జున, ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, ఎంపీటీసీ పద్మావతి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, రొద్దం, కలిపి సింగిల్ విండో చైర్మన్లు లక్ష్మినారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు, తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఈఓఆర్డీ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల మంజూరు చేస్తూ ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్ జగన్ అండగా నిలిచి మళ్లీ సీఎంను చేసుకుందామని ఎమ్మెల్యే తిప్పేస్వామి పిలుపునిచ్చారు. బుధవారం అమరాపురం గ్రామ సచివాలయం పరిధిలోని బడీగల్లి, ముస్లిం, కుంబారు వీధి, సున్నకల్లు వీధుల్లో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. అదే విధంగా ప్రజా సమస్యలపై కూడా ఆరా తీశారు. ఈ సందర్భంగా డ్రైనేజీ సమస్య, కాలువ, కొత్తగా ఇళ్లు మంజూరు చేయాలని కొంత మంది ఎమ్మెల్యే తిప్పేస్వామికి విన్నవించారు. సచివాలయ పరిధిలో పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నళిని, డైరెక్టర్ లక్ష్మీదేవి, క్రిస్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ సుందర్‌రాజు, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి, లలితమ్మ, హేమావతి సర్పంచ్ తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ, త్రిలోక్‌నాథ్, సిద్దప్ప పాల్గొన్నారు.

అందరం ఒకే గ్రూప్.. అదే జగన్ గ్రూప్

• ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం టౌన్: 'వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవు.. ఉన్నదల్లా ఒకటే గ్రూప్ అది వైఎస్ జగన్ గ్రూప్' అని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా మున్సిపాలిటీ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఇలా అన్ని స్థానాలను కైవసం చేసుకుని టీడీపీకి హిందూపురం ఇసుక కోటనేనని రుజువు చేశామన్నారు. హిందూపురంలో 2024లో ఎన్నికల్లో గెలిచేదీ వైఎస్సార్‌సీపీ నేనని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. 2024లో హిందూపురం నుంచి బాలకృష్ణ నామినేషన్ వేయడానికి కూడా భయపడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. 40 ఏళ్ల చరిత్రను హిందూపురంలో ఈ ఎన్నికల్లో తిరగరాయనున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడించి సీఎంకు బహుమతిగా ఇద్దామని అన్నారు. ఇందు కోసం ప్రతి ఒక్కరూ కలికట్టుగా కృషి చేయాలని సూచించారు. పార్టీ నిర్ణయమే తమకు శిరోధారమన్నారు. పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబీవుల్లా, జెడ్పీటీసీ నాగభూషణం, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

మడకశిర: పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని పెనుకొండ పీఆర్ ఈఈ మురళీమోహన్ కోరారు. పట్టణంలోని పీఆర్ కార్యాలయంలో బుధవారం మడకశిర, రొళ్ల మండలాలకు చెందిన గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు. డీఈ పద్మావతి, ఏఈ నవీద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని రాంపురం గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే శంకరనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

రసాయన రహిత ఆహారంతో ఆరోగ్యం



జీరో వేస్ట్ స్టోర్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్

హిందూపురం టౌన్: రసాయన రహిత ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంఎఫ్ రోడ్డు వద్ద డాక్టర్ ప్రసాద్, డాక్టర్ వాణిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రియానా గ్రీన్స్ జీరో వేస్ట్ స్టోర్‌ను ఎంపీ, ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ ఏర్పాటు గురించి డాక్టర్ వాణి వివరించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ రాయలసీమలో మొట్టమొదటిగా హిందూపురంలో జీరో వేస్ట్ స్టోర్, ప్లాస్టిక్ రహిత స్టోర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నేడు విక్రయిస్తున్న ప్రతి వస్తువులోనూ కెమికల్, ప్లాస్టిక్‌తో కూడుకున్న తరుణంలో వాటి వల్ల జరిగే ప్రమాదాన్ని గుర్తించి వైద్యులు ముందు చూపుతో కెమికల్, ప్లాస్టిక్ రహిత ఆహార పదార్థాలను విక్రయించడం సంతోషంగా ఉందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబీవుల్లా, 25వ వార్డు ఇన్‌చార్జ్ కార్తీక్, కౌన్సిలర్లు అయూబ్, ముస్తాక్, రహమత్‌బీ, గిరీష్, రోషన్ అలీ, వైస్ ఎంపీపీ రఘునాథ్‌రెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, కిరోసిన్ బాబు, షఫీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

• వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్టీసీ యూనియన్ సభ్యులు

హిందూపురం టౌన్: ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక అన్నారు. బుధవారం పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ దగ్గరున్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దీపికను ఏపీ ఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. దీపిక మాట్లాడుతూ కార్మికుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

హిందూపురం అర్బన్: మహిళా అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కిరికెర వీవర్స్ కాలనీలో కిరికెర మాజీ సర్పంచ్ ధనుంజయరెడ్డి ఆయన తల్లిదండ్రులు కమలమ్మ, రామిరెడ్డి జ్ఞాపకార్థం సొంత నిధులతో కమ్యూనిటీ భవనాన్ని (గ్రామైక్య మహిళా సంఘాల భవనం) నిర్మించారు. కమ్యూనిటీ భవనాన్ని దీపిక ప్రారంభించి మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులకు తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. సభ్యులు కోరిన విధంగా 400 కుర్చీలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని , వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లకుంట ఆనంద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీరామిరెడ్డి, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, సర్పంచ్ భాగ్యమ్మ, కవితమ్మ, చాంద్‌బాషా, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అందరికీ మేలు చేయడమే లక్ష్యం

• ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిర: గుండుమలలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

పెనుకొండ: పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో 4వ సచివాలయలో బుధవారం జగనన్న సురక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఛైర్మన్‌తో పాటు స్పెషల్ ఆఫీసర్ పద్మమ్మ, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, ఎంపీడీఓ శివశంకరప్ప పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు.

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి మేలు చేయడానికే జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని గుండుమల, బుళ్లసముద్రం గ్రామ సచివాలయాల వద్ద బుధవారం జగనన్న సురక్ష క్యాంపులు జరిగాయి. గుండుమలలో జగనన్న సురక్ష సభలో ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ఇంక అర్హత ఉండి ఏదైనా చిన్న చిన్న కారణాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు లబ్ధి పొందని వారికి వందశాతం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిని చేకూర్చి న్యాయం చేస్తామన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా ఎప్పుడు చూడని విధంగా పేదలపై ఇంత ప్రేమ చూపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగనేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీ మూర్తి, జెడ్పీటీసీలు సరోజమ్మ, భూతరాజు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు బీఎల్ రామకృష్ణ, నాగరాజు, అనిత, మండల బీసీ సెల్ నాయకులు చంద్రశేఖర్, తిమ్మప్ప, జయప్ప, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందని వారికి 'జగనన్న సురక్ష ' పథకం ద్వారా సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తమ్మడేపల్లి, బసవనపల్లి, హేమావతి గ్రామ సచివాలయంలో సచివాలయం కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి పథకాలు అందని వారికి లబ్ధిదారుల సమస్యలు నమోదు చేయాలని సూచించారు.

గోరంట్ల: మండల పరిధిలోని పులేరు సచివాలయ పరిధిలోని శెట్టిచిన్నంపల్లి వెంకటరమణపల్లి, పులేరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రఘునాథగుప్తా, పులేరు, వెంకటరమణపల్లి గ్రామ పంచాయతీల సర్పంచులు ప్రభాకారరావు, అశ్వర్థరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. వారు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రొద్దం: ప్రజల సమస్యలు అక్కడిక్కడే సత్వర పరిష్కారం చేయడానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కలిపి గ్రామ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ధ్రువపత్రాల కోసం ప్రజలు గతంలో అనేక ఇబ్బందులు పడేవారని, అలాంటిది రెండు రోజుల్లోనే వారికి అందజేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కదిరమ్మ, అన్ని శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలపి శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివ, నారేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష ' ఇలా..

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలోని కొల్హాపురి మహాలక్ష్మీదేవి కమ్యూనిటీ భవనం ఆవరణలో గురువారం ఉదయం 9.30 గంటలకు 'జగనన్న సురక్ష' పథకం కార్యక్రమంపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ తెలిపారు.

చిలమత్తూరు:మండలంలోని మొరసలపల్లిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్ పేర్కొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం గ్రామంలోని సచివాలయంలో 'జగనన్న సురక్ష ' కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు. పంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు.

పరిగి: మండలంలోని పైడేటిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. సచివాలయంలో ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందన్నారు.

గుండుమల టీడీపీ నాయకుల జాగీరు కాదు

• ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: 'మండలంలోని గుండుమల పంచాయతీ టీడీపీ నాయకుల జాగీరు కాదు... పంచాయతీలోకి ఎవరైన రావచ్చు' అని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. బుధవారం జగనన్న సురక్ష క్యాంపునకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి టీడీపీ నాయకుల బెదింపులు, దౌర్జన్యంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడికైనా వెళ్లవచ్చన్నారు. గుండుమలకు ఎమ్మెల్యే వస్తే అడ్డుకుంటామని సోషియల్ మీడియాలో పోస్టులు పెట్టారు.. తాను గుండుమల గ్రామానికి వచ్చాను ఎవరు అడ్డుకుంటారో రండి అని సవాల్ విసిరారు. సభలకు ప్రజలు వెళ్లవద్దని చెప్పి బెదిరించడానికి మీరు ఎవరని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. ఇకపై గుండుమలలో టీడీపీ నాయకుల దౌర్జన్యం, బెదరింపులను సాగనివ్వమని హెచ్చరించారు. గుండుమల పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు.





మడకశిర, బసవనపల్లిలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాల్సిందే

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లు నిరసన కొనసాగిస్తున్నారు. బుధవారం మడకశిర పట్టణంతో పాటు అమరాపురం మండలంలోని మండలంలోని హేమావతి, బసవనపల్లిలో నిరసన తెలిపారు. పవన్ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో పాటు పవన్‌కళ్యాణ్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వలంటీర్లకు పవన్ బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.
–మడకశిర/అమరాపురం